# మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

- కోరుట్ల ఎంఈవో గంగుల నరేశం
- ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ తరగతులు


కోరుట్ల: మాట్లాడుతున్న ఎంఈవో గంగుల నరేశం

కోరుట్ల, జూన్ 10: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని మండల విద్యాధికారి గంగుల నరేశం సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో పరిసరాలు, వంట సామగ్రి శుభ్రంగా ఉంచాలన్నారు. శుద్ధమైన తాగునీరందించాలన్నారు. వేడిగా ఉన్న పౌష్టికాహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. మధ్యాహ్న భోజన సహాయకులు గ్లౌజులు ధరించాలని, చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మోహన్, సీఆర్పీలు గంగాధర్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, జూన్ 10: మధ్యాహ్న భోజనం పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్ జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కావెంజర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.

# పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

మెట్‌పల్లి రూరల్, జూన్ 10: తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ కోరారు. 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా వెల్లుల్ల అంగన్‌వాడీ కేంద్రం–5లో తల్లుల కమిటీ, ఐకేపీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మణెమ్మ మాట్లాడుతూ, అంగన్‌వాడీల్లో పిల్లలకు ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లు నిండిన చిన్నారులను పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమ్ సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ నీరజ, తదితరులు పాల్గొన్నారు.


పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలోకి చిన్నారులను ఆహ్వానిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి

పెగడపల్లి, జూన్ 10: పెగడపల్లి మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపట్టారు. 3 నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరడంతో పాటు, ఐదేళ్లు దాటిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 17 వరకు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చేపడుతామని వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కథలాపూర్, జూన్ 10: సిరికొండలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాదిబేగం ఆధ్వర్యంలో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానించి, వసతులు, చిన్నారులకు అందిస్తున్న విద్య, ఆటలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సోమలత, ప్రతిభ, సునంద, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేశంగౌడ్

మాజీ మంత్రి రాజేశం గౌడ్ తన పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, రాజేశంగౌడ్‌కు కేటీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.
*-జగిత్యాల టౌన్, జూన్ 10*

## సంఘాలు-కార్యవర్గం


సారంగాపూర్: ఎన్నికైన ట్రాక్టర్ యజమానుల సంఘం సభ్యులు

సారంగాపూర్, జూన్ 10: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ యజమానుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారినేని మైసయ్య, ఉపాధ్యక్షుడిగా నల్ల మైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భూపతి నర్సింగ్, కోశాధికారిగా నల్ల మహేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని యూనియన్ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

మెట్‌పల్లి, జూన్ 10: మెట్‌పల్లి పట్టణంలోని గోల్‌హనుమాన్ మున్నూరు కాపు పటేల్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగు గంగాధర్, ఉపాధ్యక్షులుగా ఒల్లడపు లింబాద్రి, పుప్పాల ఆత్మారాం, ప్రధాన కార్యదర్శిగా బెజ్జంకి నవీన్, కోశాధికారిగా బొడ్ల రాజేందర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

పెగడపల్లి, జూన్ 10: పెగడపల్లి మండలం లింగాపూర్‌లో శ్రీరామ దూత ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలుసాని శరత్, ఉపాధ్యక్షుడిగా గజ్జి అనిల్, కోశాధికారిగా ఉప్పు సంజీవ్, కార్యవర్గ సభ్యులుగా గజ్జి మధు, తిరుపతి, అజిత్, పోరెడ్డి రఘుపతి, గోనె మధు, కాశెట్టి శ్రీను, బొల్లారపు రాజయ్య, తడగొండ శేఖర్, బోదనపు రాజమౌళి ఎన్నికయ్యారు.

మేడిపల్లి, జూన్ 10: మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో అంబేద్కర్ మాదిగ యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కశవత్తుల అంజయ్య, ఉపాధ్యక్షుడిగా నూతిపెల్లి సురేశ్, ప్రధాన కార్యదర్శిగా మారంపల్లి అంజయ్య, కోశాధికారిగా మారంపెల్లి నరేశ్, కార్యవర్గ సభ్యులుగా నూతిపెల్లి శంకరయ్య, మారంపల్లి అజయ్, నల్ల నరేశ్, నూతిపల్లి జలందర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు మాజీ ఉపసర్పంచ్ నూతిపెల్లి శంకర్ శుభాకాంక్షలు తెలిపారు.


రాము

మల్లాపూర్, జూన్ 10: మాల మహార్ సేన మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పులేరి రాము ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన మండల స్థాయి నాయకుల సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బోడ శేఖర్, ఉపాధ్యక్షులుగా ఉడుగుల గంగాధర్, దొడె గంగనర్సయ్య, కార్యదర్శులుగా ద్యాగల నారాయణ, కోడిపెల్లి రాజేందర్, సలహాదారులుగా బిట్ల నరేశ్, పాలెపు దిలీప్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా తలారి ప్రేమ్‌కుమార్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

## అన్నపై దాడి చేసిన తమ్ముడికి జైలు

మెట్‌పల్లి, జూన్ 10: భూ తగాదా విషయంలో అన్నపై దాడి చేసిన తమ్ముడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం మెట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అరుణ్‌కుమార్ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కొడుకులు ఉన్నారు. గ్రామ రెవెన్యూ శివారులో మల్లయ్యకు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా, ఐదుగురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల స్థలాన్ని వదిలేసి మిగతా భూమిని నలుగురు అన్నదమ్ములు కలిసి ఒక్కొక్కరూ ఒక్కో సంవత్సరం చొప్పున వ్యవసాయం చేసుకున్నారు. ఈ క్రమంలో 2019 ఆగస్టు 31న బీరయ్య తన ట్రాక్టర్‌తో వారు చేసుకుంటున్న పంటను ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా అడ్డుగా వెళ్లిన తన అన్న ముత్తయ్యను పారతో కొట్టగా కుడి భుజంపై గాయమైంది. మరో సోదరుడు నడిపి మల్లయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడు బీరయ్యను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. సాక్షుల విచారణ, వాద ప్రతివాదనల అనంతరం నిందితుడు బీరయ్యకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. పకడ్బందీగా కేసు దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలు, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ ప్రణయ్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు పీసీ సునీల్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## విద్యార్థులకు పురస్కారాలు


విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

జగిత్యాల, జూన్ 10: పట్టణంలోని ఎల్ఎల్ గార్డెన్‌లో గౌడ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో 90 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, నాయకుడు ప్రసన్న హరికృష్ణ, గోపా సభ్యులు రవీందర్ గౌడ్, రాజయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి


వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు, కాలనీ వాసులు

కోరుట్ల, జూన్ 10: తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య వాహన సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ ప్రజలను కోరారు. పట్టణంలోని 33 వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి, హానికర చెత్త సేకరణ, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నివారణపై కమిషనర్ కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ మాట్లాడుతూ, ఇండ్ల నుంచి సేకరించిన తడి చెత్తను కంపోస్ట్ సెంటర్‌కు తరలించి ఎరువుగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు స్ట్రాంగ్ వాటర్ డ్రైన్‌లో భాగంగా మురుగు కాలువల్లో పారిశుధ్య కార్మికులు పూడిక తీశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కరపత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శ్రీరామ్‌గౌడ్, సీఈవో సంధ్య, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి


చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి నరేశ్

రాయికల్, జూన్ 10: ప్రజలు అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని మాతా శిశు సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ అధికారి డాక్టర్ బోనగిరి నరేశ్ సూచించారు. రాయికల్ మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం–2తో పాటు కుమ్మరిపెల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల నమోదు శాతం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మమత, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, సుమలత, వనిత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## నువ్వు సాగుపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

సారంగాపూర్, జూన్ 10: రైతులు నువ్వు సాగుపై దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ సూచించారు. బీర్‌పూర్ మండలం చిత్రవేణి గూడెం గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, అఖిల భారత సమన్వయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ మాట్లాడుతూ, నువ్వు సాగు విస్తీర్ణం పెంచాలని, మేలైన నూతన నువ్వుల వంగడాలను సాగుచేయాలని , విత్తనోత్పత్తి చేపట్టి అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచించారు. నూనెగింజల పంటల్లో వచ్చే చీడపీడల యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఏడీఏలు తిరుపతి నాయక్, డాక్టర్ సాయినాథ్, స్వాతి, తిరుపతి, మండల వ్యవసాయాధికారి ప్రదీప్ రెడ్డి, ఏఈవో వినోద్, మాజీ సర్పంచులు చిక్రం సుగుణ మారుతి, నల్ల మైపాల్ రెడ్డి, రైతులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు యూనిఫామ్స్ అందజేత


యూనిఫాం పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారి ప్రభాకర్

వెల్గటూర్, జూన్ 10: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయడానికి ఏక రూప దుస్తులను మంగళవారం మండల విద్యాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావేంజర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PASSPORT LOST
★Bhukya Ganesh S/o.Lingam H.No. 2-26, R/o. Vanpalle, Vernapally Mandal Rajanna Sircilla Dist. My Passport No.H8339529 Lost By travelling from Vanpalle to Sircilla. If any one Find Please Call me : 9494993998
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## మాజీ ఎమ్మెల్యే జ్యోతిదేవికి నివాళి

మెట్‌పల్లి, జూన్ 10: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవి జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా జ్యోతిదేవి ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, నాయకులు కంతి హరికుమార్, గంగారెడ్డి, పెంట ప్రణయ్ తేజ, పల్లికొండ ప్రవీణ్, బర్ల వంశీ, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కండ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం


గ్రామస్తుడిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జగిత్యాల రూరల్, జూన్ 10: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామంలో మంగళవారం కరీంనగర్‌లోని మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎల్లాపి సంఘం అధ్యక్షుడు శేఖర్, కొండ రాకేశ్, దవాఖాన మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం


ఉపాధ్యాయులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈవో మధు

ఇబ్రహీంపట్నం, జూన్ 10: మండలంలో ఈనెల 12 నుంచి పాఠశాలల పునఃప్రారంభానికి సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈవో బండారి మధు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులకు మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఈనెల 12న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు సత్కారం

మేడిపల్లి, జూన్ 10: మేడిపల్లి మండలం కొండాపూర్ మాజీ సర్పంచ్ ద్యావనపెల్లి అభిలాష్ వివాహం సుష్మజతో ఇటీవల జరిగింది. విద్యావేత్త డాక్టర్ ప్రసన్న హరికృష్ణ మంగళవారం నూతన వధూవరులను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు అంకం విజయసాగర్, మాజీ సర్పంచ్ ఈర్నాల సంపత్‌కుమార్, నాయకులు మల్లేశ్‌గౌడ్, గణేశ్, అనిల్, శ్రీనివాస్‌రావు, కళ్యాణ్, కమలాకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మెట్‌పల్లి, జూన్ 10: పట్టణంలో ఈనెల 11న రెండో సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ లోక్ కోర్టు (విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక) నిర్వహిస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ మెట్‌పల్లి ఏడీఈ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 33/11 కేవీ ఉపకేంద్రం ఆవరణలో జరిగే ఈ వేదికకు సీజీఆర్ఎఫ్ లోకల్ కోర్టు చైర్మన్ నారాయణ, సాంకేతిక సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. లోకల్ కోర్టు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు. లోకల్ కోర్టులో మెట్‌పల్లి రూరల్, మెట్‌పల్లి టౌన్–1, 2 సెక్షన్లకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి, జూన్ 10: మండల కేంద్రానికి చెందిన మర్రిపెల్లి లింగం గౌడ్‌కు రూ. 16,500, ఆర్మూరి సంజనకు రూ. 15 వేలు, గోపు రాజుకు రూ. 60 వేలు, పెద్దవేని రాజేశ్‌కు రూ. 29 వేలు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. కాగా, లబ్ధిదారులకు మంగళవారం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగం రాజేశ్, నాయకులు ఉరుమడ్ల నర్సయ్య, మార్గం నవీన్, గోపు రాజిరెడ్డి, వేములవాడ మధుకర్, తోట రాజేందర్, బొడ్డుపల్లి చందు, దుమాల ప్రవీణ్, కుందారపు వినోద్, సల్మాన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుల స్థల పరిశీలన

సారంగాపూర్, జూన్ 10: మండల కేంద్రంలో మంగళవారం అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థల పరిశీలన చేసి, వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, కార్యదర్శి హేమలత పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్/కథలాపూర్, జూన్ 10: మండలంలోని గుమ్లాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు మార్కింగ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటినిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో వోదెల రామకృష్ణ లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నీరజ్, కార్యదర్శులు శ్రీనివాస్, సరిత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలో 4 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు, నాయకులు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, ఆకుల సంతోష్, నరేశ్‌రెడ్డి, మొయిన్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సారంగాపూర్: లబ్ధిదారు ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగాధర్

## దరఖాస్తుల ఆహ్వానం

వెల్గటూర్, జూన్ 10: వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లిలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు–1, ఇంగ్లిష్–1, మ్యాథ్స్– 1, జువాలజీ–1, కెమిస్ట్రీ–1, టీజీటీ కెమిస్ట్రీ–1, తెలుగు–1, హిందీ–1, ఇంగ్లిష్–1, మ్యాథ్స్–1, సైన్స్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీతో పాటు బీఈడ్, టెట్ ఉన్న వారు ఈనెల 15వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

జగిత్యాల, జూన్ 10: పట్టణంలోని 40వ వార్డులో బీటీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ చైర్మన్లు అడువాల జ్యోతి–లక్ష్మణ్, గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శివ కేసరి బాబు, ఓరుగంటి నగేశ్, కొత్త ప్రతాప్, డీఈ నాగేశ్వర్, ఏఈ శరన్ పాల్గొన్నారు. అలాగే, జగిత్యాలలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను నూకపల్లి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులు కలిసి స్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. అలాగే, మల్యాల మండలం నూకపల్లి జ్ఞానధ్యాన విజ్ఞాన సరస్వతీ ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి గురువారం నిర్వహించే ఆలయ 11వ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే, జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గౌడ యువజన సంక్షేమ సంఘం సభ్యులు కలిసి సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జేఏసీ సభ్యులు కలిసి ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేసేలా చొరవ తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

## మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

జగిత్యాల రూరల్, జూన్ 10: మండలంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామ పదాధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ చరణ్ దాస్ మాట్లాడుతూ, జిల్లాలో నూతనంగా ఎన్నికైన మహిళా సంఘాల కార్యవర్గ సభ్యులకు వివిధ అంశాలపై రెండు రోజుల చొప్పున శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మాణిక్ రెడ్డి, స్టేట్ రిసోర్స్ పర్సన్ లలిత, అన్నపూర్ణ, ఏపీఎం, గంగాధర్, సీసీలు, సమాఖ్య అధ్యక్షులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు స్వాగతం

ధర్మపురి, జూన్ 10: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం మొదటిసారి ధర్మపురికి వచ్చిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కాంగ్రెస్ శ్రేణులు, ధర్మపురి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. మొదట పత్తిపాక ఎక్స్‌రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికి, అక్కడి నుంచి బైక్ ర్యాలీగా ధర్మపురికి బయలుదేరగా ధర్మారం, రాజారాంపల్లి, ఎండపెల్లి, వెల్గటూర్, రాయపట్నం కూడళ్ల వద్ద కాంగ్రెస్ శ్రేణులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురికి చేరుకున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారలను దర్శించుకొని పూజలు చేశారు. అలాగే, పట్టణ శివారులోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంత్రిగా నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా ఈద్-ఉల్-అదా వేడుకలు

జగిత్యాల, జూన్ 10: సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) ఆధ్వర్యంలో ఈద్–ఉల్–అదా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాటా వ్యవస్థాపకుడు మల్లేశం, సాటా రియాద్ చాప్టర్ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, ఉమెన్స్ చాప్టర్ అధ్యక్షురాలు శర్వాణి విద్యాధరణి, వైస్ ప్రెసిడెంట్ నూర్ మహ్మద్, రియాద్ ఇంజినీరింగ్ చాప్టర్ అధ్యక్షుడు సింగు నరేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 13న జాబ్‌మేళా

జగిత్యాల రూరల్, జూన్ 10: జగిత్యాలలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వీవీసీ మోటార్స్‌లో హెవీ ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన టెక్నీషియన్ ట్రైనింగ్ ఇప్పించి సదరు కంపెనీలో ఉద్యోగం ఇస్తారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ట్రైనింగ్ సమయంలో భోజనం, వసతి సదుపాయం ఉచితంగా కల్పించడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ పూర్తయిన వారికి మహీంద్ర కంపెనీలో ఉద్యోగం ఇస్తారని తెలిపారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే, ఆటోమోటివ్ స్పేర్స్ ఫికర్స్ 15, టెలికాలర్స్ 15, ఆక్సెసరీస్ ఎగ్జిక్యూటివ్స్ 15 ఉద్యోగాలకు నేరుగా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీయువకులు ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

## టేకు చెట్లు నరికి ఎత్తుకెళ్లిన దొంగలు

కథలాపూర్, జూన్ 10: కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామంలో నలుగురు రైతులకు చెందిన టేకు చెట్లను నరికివేసి ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాల్వ రాజేశం, తీగల వెంకట్రావు, కనకట్ల ప్రసాద్, తీగల సత్యారావుకు చెందిన 11 టేకు చెట్లను దొంగలు సోమవారం రాత్రి కోసి ఎత్తుకెళ్లారన్నారు. కలప విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

## గ్రామాల్లో బడిబాట

కోరుట్ల రూరల్, జూన్ 10: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నాగులపేటలో ఇన్‌చార్జి మండల విద్యాధికారి గంగుల నరేశం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


నాగులపేటలో బడిబాట ర్యాలీ తీస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, గ్రామస్తులు